
సాక్షి ఖమ్మం

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



నేడు సమ్మె, గ్రామీణ బంద్

కేంద్రం విధానాలను నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యాన శుక్రవారం సమ్మె, గ్రామీణ ప్రాంతాల బంద్‌కు పిలుపునిచ్చారు. 8లో



రూ.కోట్లు కాజేసినా చర్యలేవి?

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి జీపీ నిధులు రూ.కోటి మేర వాడుకున్న ఉద్యోగులపై ఐదేళ్లయినా చర్యలు తీసుకోలేదు. 8లో

గరిష్టం / కనిష్టం 34° / 17°

వాతావరణం

జిల్లాలో ఉదయం చలి ప్రభావం ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్ట స్థాయి చేరే అవకాశముంది.

జిల్లాలో ఉద్యోగుల బదిలీల కోలాహలం నెలకొంది. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒకే ప్రాంతంలో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం కలుగుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో అన్ని శాఖల్లోనూ బదిలీలు జరుగుతున్నాయి. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, గ్రామీణాభివృద్ధితో పాటు ఇతర శాఖల అధికారులకు బదిలీ జరగగా.. ఇందులో శాఖల ఉన్నతాధికారులు సైతం ఉన్నారు. దీంతో పాత అధికారులు రిలీవ్ అవుతుండగా, కొత్త అధికారులు విధుల్లో చేరుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి మిగిలిన శాఖల్లోనూ బదిలీలు జరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈమేరకు దాదాపు అన్ని శాఖల్లో కొత్త అధికారులే ఉండగా.. తొలుత పాలనపై పట్టు సాధించి ఆ తర్వాత ఎన్నికల విధుల్లో నిమగ్నం కానున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

అంతటా కొత్త టీం!



జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు స్థానచలనం

- విధుల్లో చేరుతున్న నూతన అధికారులు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీల పరంపర
- షెడ్యూల్ వచ్చే నాటికి మరికొందరికి కూడా..

ఎన్నికల వేళ..

పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఒకేచోట మూడేళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల విధుల్లో క్రియాశీలకంగా వ్యవహరించే అధికారులు, ఉద్యోగులను ప్రాధాన్యత క్రమంలో బదిలీలు చేయడం మొదలుపెట్టగా... ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ రాజ్ శాఖలతోపాటు మరికొన్ని శాఖల్లోనూ బదిలీలు జరిగాయి.

పోలింగ్‌కు ఏర్పాట్లు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా వెలువడొచ్చనే సంకేతాలతో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రభుత్వం ఓ పక్క అధికారులను బదిలీ చేస్తుండగా, కొత్త వారు విధుల్లో చేరుతున్నారు. ఇక జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నేతృత్వాన ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇప్పటికే ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తయింది. అలాగే సెక్టోరియల్ అధికారులకు శిక్షణ కూడా పూర్తి చేసి మిగతా ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

బదిలీలు ఇలా..

- ఎక్సైజ్‌శాఖలో మూడేళ్ల తర్వాత ఒకేసారి భారీ సంఖ్యలో బదిలీలు జరిగాయి. ఖమ్మం స్టేషన్–1 సీఐ కె.రాజు ఖిలా వరంగల్‌కు బదిలీ కాగా.. ఖమ్మం స్టేషన్–2 సీఐ రాజిరెడ్డి మణుగూరుకు, నేలకొండపల్లి సీఐ పోశెట్టి పెద్దపల్లికి, ఖమ్మం డీటీఎఫ్ సీఐ ఆర్.విజేందర్ ఆదిలాబాద్‌కు, ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు సామ్యూల్ జాన్ కాగజ్‌నగర్‌కు, సర్వేశ్వరరావు జగిత్యాలకు బదిలీ అయ్యారు. సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు వేములవాడ, మధిర సీఐ ప్రసాద్ పాల్వంచకు, వైరా సీఐ రమ్య భూపాలపల్లికి బదిలీ అయ్యారు. అలాగే బుధవారం ఎక్సైజ్ ఎస్సైలను బదిలీ చేశారు.
- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.విద్యాచందన భద్రాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు. అడిషనల్ డీఆర్‌డీఓ బి.శిరీష సూర్యాపేట జిల్లాకు, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు సూర్యాపేట సీఈఓగా వెళ్లారు. ఇక డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌ను భద్రాద్రి జిల్లాకు పంపారు.
- పోలీస్ శాఖలో సత్తుపల్లి ఏసీపీగా ఎ.రఘును నియమించారు. ఇక్కడి ఏసీపీ బి.రామానుజంను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. జిల్లాలోని ఖానాపురం, ఖమ్మం వన్‌టౌన్, సీఎస్‌బీ, నేలకొండపల్లి, ఖమ్మం టాస్క్‌ఫోర్స్, తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్, ఖమ్మం త్రీ టౌన్ ఎస్సైలు, బుధవారం ఖమ్మం నగరం, రూరల్ ఏసీపీలు సైతం బదిలీ అయ్యారు.
- జిల్లాలో పలువురు ఎంపీడీఓలకూ స్థానచలనం కలిగింది. తల్లాడ ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణితో పాటు కల్లూరు, మధిర, పెనుబల్లి, ఎర్రుపాలెం, ఏన్కూరు, మహబూబాబాద్, బోనకల్, చింతకాని, కామేపల్లి, ఖమ్మంరూరల్, కొణిజర్ల, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, రఘునాథపాలెం, సింగరేణి, వైరా ఎంపీడీఓల బదిలీ జరగగా.. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి కలెక్టర్ పోస్టింగ్‌లు కేటాయించారు.
- జిల్లా ఇన్‌చార్జ్ రవాణా శాఖాధికారిగా ఎం.డీ.గౌస్‌పాషా కొనసాగుతుండగా.. రెగ్యులర్ డీటీఓగా ఆఫ్రిన్ సిద్దిఖీని నియమించారు. అలాగే వ్యవసాయ శాఖకు సంబంధించి వైరా ఏడీఏ వేల్పుల బాబూరావుకు భద్రాద్రి జిల్లా బదిలీ అయింది. ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ ఎం.సతీష్‌ను వైరాకు బదిలీ చేశారు.
- సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపల్ కమిషనర్లు కూడా బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొత్తగా వచ్చిన అధికారులు గురువారం విధుల్లో చేరారు.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డీటీఓ ఆఫ్రిన్



కలెక్టర్ గౌతమ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీటీఓ

ఖమ్మంక్రైం: జిల్లా రవాణా శాఖాధికారిగా ఆఫ్రిన్ సిద్దిఖీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్–1 అధికారి అయిన ఆమె పెద్దపల్లి డీటీఓగా విధులు నిర్వర్తిస్తుండగా, ఖమ్మం బదిలీ చేయగా విధుల్లో చేరారు. ఆమె వరంగల్‌లో పనిచేస్తున్నప్పుడు ఏజెంట్ల వ్యవస్థపై ఉక్కుపాదం మోపారు. నకిలీ ఇన్సూరెన్స్ వ్యవహారాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏజెంట్ల ఆట కట్టించారు. విధినిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరున్న ఆఫ్రిన్, బాధ్యతలు స్వీకరించాక కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, ఆమెకు ఎంవీఐలు వరప్రసాద్, గౌస్‌పాషా, శంకర్‌నాయక్, ఏఓలు జాహిద్‌అలీ, సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

తెల్లచేపల పెంపకంపై శిక్షణ



కరదీపికలు విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో తెలంగాణ పశువైద్య విద్యాలయం, జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యాన దేశవాళీ తెల్లచేపల పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్నారు. మూడు రోజుల పాటు సాగే శిక్షణకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మత్స్యకారులు హాజరయ్యారు. ఈమేరకు ప్రారంభ సమావేశంలో ఒడిశాలోని స్కూల్ ఆఫ్ ఫిషరీస్ ప్రొఫెసర్, పాలేరు పరిశోధనా కేంద్రం పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మత్స్యకారులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ చేపల ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి, పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త రవీందర్ మాట్లాడగా, అవగాహన కరదీపికలను విడుదల చేశారు.

జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి



స్తంభం ఎక్కుతున్న అభ్యర్థి

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్ల నాలుగో దశ ఎంపిక ప్రక్రియ ముగిసింది. 2019లో నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దశల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 13మందికి సమాచారం ఇవ్వగా, ఖమ్మంలో గురువారం నిర్వహించిన పరీక్షకు 12మంది హాజరయ్యారు. ఎస్‌ఈ ఏ.సురేందర్ చైర్మన్‌గా నియామకమైన కమిటీ ఆధ్వర్యాన అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించాక స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. కాగా, పరిశీలకులుగా ఎన్పీడీసీఎల్ సీజీఎం అశోక్‌కుమార్ వ్యవహరించగా, డీఈలు బాబూరావు, నాగేశ్వరరావు, జిలానీ పాషా పర్యవేక్షించారు. వీడియో చిత్రీకరణ నడుమ నిర్వహించిన పరీక్షను హనుమకొండ నుంచి ఎన్పీడీసీఎల్ సీఎండీ పరిశీలించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారి వివరాలతో కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది.

సీఓఈల్లో ప్రవేశానికి 18న పరీక్ష

భద్రాచలంఅర్బన్: తెలంగాణ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలల్లో కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ)గా గుర్తించిన వాటిలో ప్రవేశానికి ఈనెల 18 పరీక్ష నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3,081మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఎనిమిది కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలంలోని సీఓఈ–2, దమ్మపేటలోని సీఓఈ, మణుగూరు, కొత్తగూడెంలోని యూఆర్‌జేసీలు, అంకంపాలెంలోని ఆర్‌జేసీ, భద్రాచలంలోని ఈఎంఆర్‌ఎస్, సింగరేణి ఈఎంఆర్‌ఎస్‌తో పాటు ఖమ్మంలోని ఆర్టీసీలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8గంటలకల్లా హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, ప్యాడ్, పెన్నులతో హాజరుకావాలని సూచించారు.

చేగొమ్మ పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

మట్టి వ్యవహారంలో రిమాండ్‌లో ఉన్న చైర్మన్ శేఖర్



డీసీఓకు అవిశ్వాసం లేఖ అందజేస్తున్న డైరెక్టర్లు

కూసుమంచి: కూసుమంచి మండలంలోని చేగొమ్మ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌పై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం ఖమ్మంలో జిల్లా సహకార శాఖ అధికారి మురళీధర్‌రావుకు అవిశ్వాస తీర్మాన ప్రతి అందజేశారు. సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా, ఎనిమిది మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. మిగిలిన ఐదుగురిలో ముగ్గురు బీఆర్‌ఎస్, ఇద్దరు సీపీఎం డైరెక్టర్లు ఉన్నారు.

రిమాండ్‌లో చైర్మన్ శేఖర్

చేగొమ్మ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ జీళ్లచెరువు దేవాలయ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వి తరలించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈకేసులో ఆయనను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేయగా, ఇదే కేసులో ఆయనతో పాటు మరో డైరెక్టర్ కొండా వెంకన్న కూడా జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. చైర్మన్‌పై అవిశ్వాసానికి మెజార్టీ సభ్యుల మద్దతు ఉండడంతో తీర్మానం నెగ్గి, శేఖర్ పదవి కోల్పోయే అవకాశముంది. కాగా, ఇప్పటికే జిల్లాలోని రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై అవిశ్వాసం నెగ్గగా, ఆయన పీఏసీఎస్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ పదవి కోల్పోయిన విషయం విదితమే.

రూ.21 వేలకు పడిపోయిన మిర్చి ధర



ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర రోజురోజుకు తగ్గుతోంది. మూడు రోజుల వ్యవధిలో ఏకంగా రూ.1,300 మేర ధర తగ్గడం గమనార్హం. ఈనెలారంభం నుంచి మిర్చి ధర పెరుగుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైనా ఎన్నో రోజులు నిలవలేదు. ఈనెల 12న క్వింటా మిర్చికి రూ.22,300గా పలికిన ధర, 13న రూ.21,850కు, 14న రూ.21,421కు పడిపోయి గురువారం రూ.21వేలకు దిగింది. చైనా నుంచి ఆర్డర్లు వస్తేనే తేజా రకం మిర్చికి మంచి ధర వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా, గురువారం ఖమ్మం మార్కెట్‌కు ఎర్ర మిర్చి 36,175 బస్తాలు, తాలు మిర్చి 3,310 బస్తాలను విక్రయానికి తీసుకొచ్చారు. మార్కెట్‌కు శుక్రవారం నుంచి ఆదివారం వరకు సెలవులు ఉండగా, సోమవారం ధర ఎలా ఉంటుందోనని ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

రమణీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఐఏఎస్ అధికారి బాలాజీ మంజులే దర్శించుకోగా, భద్రాచలానికి చెందిన ముసులూరి మస్తాన్‌రావు – లక్ష్మి దంపతులు స్వామి ప్రసాదానికి ఉపయోగపడే రూ.30వేల విలువైన పాత్ర అందజేశారు.



ఈఓ రమాదేవికి చెక్కు అందజేస్తున్న దాతలు

నిత్యాన్నదానానికి భారీ విరాళం

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని ఏలూరుకు చెందిన డాక్టర్ రాధిక తన తండ్రి డాక్టర్ యార్లగడ్డ చంద్రమౌళితో కలిసి రూ.25లక్షల చెక్కును ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని సన్మానించి స్వామి దర్శనం చేయించారు.

వద్దిరాజుకు శుభాకాంక్షల వెల్లువ



రవిచంద్రను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర గురువారం నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని శాసనసభ ఆవరణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డికి ఎమ్మెల్యేలు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, డాక్టర్ తెల్లం వెంకట్రావుతో కలిసి ఆయన నామినేషన్ సమర్పించారు. ఈమేరకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొనగా వద్దిరాజు సోదరులు కిషన్, దేవేందర్, వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు సాయినిఖిల్‌చంద్ర, నాగరాజు, ప్రీతమ్, విజయ్, ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు కొండా దేవయ్య, ఆకుతోట ఆదినారాయణ, ఆకుల గాంధీ, పొన్నం వెంకటేశ్వర్లు, చెరుకూరి శేషగిరిరావు, గొరిశెట్టి వినోద్, సుంకర చిరంజీవి, భానుప్రతాప్ తదితరులు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, వద్దిరాజు రవిచంద్రకు పార్టీ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

ప్రణాళికాయుతంగా లక్ష్యసాధన



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

ఎంపీడీఓలతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ సూచనల మేరకు శాఖల వారీగా లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఇటీవల విధుల్లో చేరిన ఎంపీడీఓలతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశమైన ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి మంచిపేరు సాధించాలన్నారు. ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమే అయినా.. ఏ ప్రాంతంలో ఎంత సేవ చేశామన్నదే ముఖ్యమని తెలిపారు. గ్రామాల్లో పాలకవర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యాన ఎంపీడీఓలు కీలకంగా వ్యవహరించాలని, ప్రత్యేకాధికారులకు సూచనలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అలాగే, ఉపాధి హామీ పథకం, రూ.500కు గ్యాస్ సిలిండర్ పంపిణీ తదితర పథకాలపై కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడగా, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ హరికిషన్, డీఎస్‌ఓ చందన్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ అప్లికేషన్లపై అవగాహన

లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులంతా ఐటీ అప్లికేషన్లపై అవగాహన కలిగి ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సందీప్ కుమార్ సూచించారు. ఢిల్లీ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడగా... సీ విజిల్ తదితర అప్లికేషన్లపై అవగాహన కల్పించి సందేహాలు నివృత్తి చేశారు. ఈ వీసీలో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్‌డీఓ గణేష్, ఎస్‌డీసీ రాజేశ్వరి, తహసీల్దార్లు స్వామి, రామకృష్ణ, సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' 70శాతమే..

- పత్రాల సమర్పణలో గ్రామీణులు ముందంజ
- అపోహలతో వెనుకబడిన పట్టణవాసులు
- మరో రెండు రోజుల్లో తుది దశకు ప్రక్రియ



ధ్రువపత్రాలు సేకరిస్తున్న ఎస్‌ఈ సురేందర్, ఉద్యోగులు



మీటర్ రీడింగ్ తీస్తున్న ఉద్యోగి

ఖమ్మంవ్యవసాయం: ఉచిత విద్యుత్‌కు సంబంధించిన గృహజ్యోతి పథకం అమలు కోసం ధ్రువపత్రాల సేకరణ జిల్లాలో 70 శాతం మేర పూర్తయింది. ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా విద్యుత్‌శాఖ ఉద్యోగులు రేషన్, ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. ఈనెల 5వ తేదీన ప్రక్రియ మొదలుకాగా, గృహజ్యోతి దరఖాస్తుల ఆధారంగా ప్రత్యేక యాప్‌లో సేకరించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రజాపాలన సభల్లో 4.27 లక్షల మంది గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గురువారం నాటికి ప్రభుత్వం ఇచ్చిన వివరాల ఆధారంగా సుమారు 3లక్షల మంది(70 శాతం) ధ్రువపత్రాలు సేకరించారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా, ఎన్పీడీసీఎల్‌కు వివరాలు చేరుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి

గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమైంది. ఈమేరకు ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి వివరాలు సేకరిస్తుండగా, గ్రామాల్లో రశీదు, రేషన్, ఆధార్ కార్డు అందజేస్తున్నారు. మీటరు రీడింగ్‌కు వచ్చిన సిబ్బందికి అన్ని వివరాలు అందజేసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయించుకున్నారు. పలు గ్రామాల్లో గ్రామపంచాయితీ, విద్యుత్ కార్యాలయాలు, సబ్ స్టేషన్ల వద్ద కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి వివరాలు నమోదు చేస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.

పట్టణాల్లో నత్తనడక

ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో ధ్రువపత్రాల సేకరణ నత్తనడకన సాగుతోంది. ఖమ్మం సహా మధిర, వైరా, సత్తుపల్లి తదితర పట్టణాల్లో ఉంటున్న వారి వద్ద రేషన్ కార్డులు లేకపోవడం.. చాలా మంది అద్దె ఇళ్లలో ఉంటుండడంతో పథకం తమకు వర్తిస్తుందో, లేదో నన్న భావనలో ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు చెబుతున్నారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు గ్రామాల్లో ఉండగా.. పట్టణాల్లో నివాసముంటున్న వారు సైతం ఆసక్తి చూపడం లేదని సమాచారం. విద్యుత్ శాఖ ఉద్యోగులు మాత్రం దరఖాస్తు అందిన ప్రతీ ఇంటికి వెళ్లి గృహజ్యోతిపై అవగాహన కల్పించి వివరాలు నమోదు చేస్తున్నారు.

17 నాటికి తుది దశకు...

గృహజ్యోతి అర్హుల నిర్ధారణ ప్రక్రియ ఈనెల 17వ తేదీ నాటికి తుది దశకు చేరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం నగరంతో పాటు పట్టణాలపై ప్రత్యేక దృష్టి సారించి రెండు రోజుల్లో ధ్రువపత్రాల సేకరణ, ఆన్‌లైన్‌లో నమోదు పూర్తిచేస్తామనే భావనలో ఉన్నారు. కాగా, గురువారం సాయంత్రం ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ జిల్లాలోని అధికారులు, ఉద్యోగులతో వీసీ ద్వారా సమావేశమై పలు సూచనలు చేశారు.

లెక్కలన్నీ తీయండి..



మట్టి తవ్వకాలు చేపట్టిన క్వారీ

- డీజీపీఎస్ ద్వారా మైనింగ్ సమాచార సేకరణ
- క్వారీల లీజ్‌లు, అనుమతులపై ఆరా
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు వివరాలు నమోదు

ఖమ్మంఅర్బన్: ఇసుక, మట్టి, గ్రానైట్ తవ్వకం, తరలింపులో అక్రమాలకు చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లాల వారీగా క్వారీల లీజ్, అనుమతులు, తవ్వకాలకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించాలని ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా అధికారులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

ఇప్పటికే కొందరి అరెస్ట్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మైనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. గత కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుక తవ్వకం, తరలింపు జరిగాయనే ఆరోపణలు రాగా, వీటికి చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లాలో కూడా మట్టి అక్రమాలపై అధికార, ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఇప్పటికే మట్టి అక్రమ తవ్వకాలపై బీఆర్‌ఎస్ నాయకుడు సహా ఇంకొందరిని అరెస్ట్ చేశారు. ఇదే సమయాన అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలియడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఎక్కడి నుంచైనా పరిశీలించేలా...

జిల్లాల వారీగా మైనింగ్‌కు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వ సూచనలతో యంత్రాంగం సేకరిస్తోంది. జిల్లాలోని మొత్తం క్వారీలు, వాటికి సంబంధించి సర్వేనంబర్లు, లీజ్ పరిధి, తవ్వకాలు చేసిన తీరుపై వివరాలు సేకరిస్తుండగా, పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఫొటోలతో సహా పొందుపర్చనున్నారు. తద్వారా డీజీపీఎస్(డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) ద్వారా ఎక్కడి నుంచైనా పరిశీలించేలా వెసులుబాటు ఉంటుందని తెలుస్తోంది. దీంతో జిల్లాల్లో ఎక్కడైనా అక్రమాలు జరిగి అధికారులు వివరాలు వెల్లడించకున్నా ఉన్నతాధికారులు గుర్తించే అవకాశముంటుంది.

224 అనుమతులు...

మైనింగ్‌కు సంబంధించి జిల్లాలో ఎక్కువగా గ్రానైట్, మట్టి క్వారీలు ఉన్నాయి. కొన్నేళ్లుగా జిల్లాను ఆనుకుని జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుండడంతో మట్టి అవసరమవుతోంది. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు అనుమతి తీసుకుని మట్టి ఉపయోగించుకుంటున్నారు. అయితే, ఇదే అదనుగా కొందరు అక్రమంగా మట్టి అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఈమేరకు ప్రభుత్వ సూచనలతో జిల్లా అధికారులు వివరాలు సేకరించగా... 1,316 హెక్టార్ల ప్రభుత్వ భూమి 187 హెక్టార్ల పట్టా భూమి, 1,432 హెక్టార్ల అటవీ భూముల్లో వివిధ రకాల మైనింగ్ అనుమతులు ఉన్నట్లు తేలింది. మొత్తంగా 2,700కు పైగా హెక్టార్లలో 224 మైనర్, మేజర్ మైనింగ్ అనుమతులు ఉన్నాయి. బైరటీస్, డోలమైట్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, స్టోన్ మెటల్, మట్టి క్వారీలు ఉన్నట్లు అధికారిక సమాచారం. జిల్లాలో మైనింగ్ ద్వారా ఈ ఏడాది రూ.62.51 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా, ఇప్పటికే రూ.68.21 కోట్లు సమకూరినట్లు చెబుతున్నారు. ఇక అక్రమ మైనింగ్‌పై జిల్లా వ్యాప్తంగా 494 కేసులు నమోదు చేసి రూ.88.72 లక్షల జరిమానా విధించారు.

నేడు సమ్మె, గ్రామీణ బంద్

- అఖిలపక్షం ఆధ్వర్యాన పిలుపు
- ఇప్పటికే జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం
- వ్యాపార, వాణిజ్య సంస్థల మద్దతు కోరిన పార్టీలు


అఖిలపక్షం సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపిస్తూ శుక్రవారం దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు అఖిలపక్షం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు జిల్లాలో బంద్‌ను విజయవంతం చేసేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా జిల్లా అంతటా విస్తృత ప్రచారం చేయగా, బంద్‌కు సహకరించాలని వ్యాపార, వాణిజ్య, రవాణ సంస్థల యజమానులను కలిసి కోరారు. కాగా, బంద్‌కు వివిధ సంగాల బాధ్యులు, వ్యాపార సంస్థల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలే కాకా ఆయా పార్టీల అనుబంధ సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేయగా, బంద్ విజయవంతానికి కేడర్‌ను సమాయత్తం చేశారు.

జయప్రదం చేయండి

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపడుతున్న సమ్మె, బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మికవర్గ, ప్రజా సమస్యలను పరిష్కరించలేదని ఆరోపించారు. ఈమేరకు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేలా చేపడుతున్న బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు కొత్త సీతారాములు, జానీమియా, పాషా, ఆవుల వెంకటేశ్వర్లు, గోవిందరావు, జి.రామయ్య, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'లంచ్ అవర్'లో ధర్నా

ఖమ్మం సహకారనగర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఆవరణలో నిరవహిస్తున్న లంచ్ అవర్ ధర్నాను విజయవంతం చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ ఒక ప్రకటనలో కోరారు. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏఐఎస్‌జీఈఎఫ్) పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శభాష్ మమత!

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు


బొల్లికొండ మమత

కూసుమంచి: ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించటమంటే ఎంతో శ్రమించాలి. అలా కష్టపడినా కొందరికి ఫలితం దక్కకపోవచ్చు. కానీ కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన వివాహిత ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించింది. ముత్యాలగూడెంకు చెందిన బొల్లికొండ మమత బీటెక్ పూర్తి చేశాక ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈక్రమంలో గురుకుల బోర్డు ఆధ్వర్యాన లైబ్రరీ పోస్టులకు దరఖాస్తు చేయగా, తాజాగా ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో మమత లైబ్రరీ సైన్స్ విభాగంలో డీఎల్(డిగ్రీ కాలేజ్), జేఎల్(జూనియర్ కాలేజ్)తో పాటు స్కూల్ లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైంది. ఆమె భర్త నవీన్ సూర్యాపేట జిల్లా మోతె మండలంలో విద్యాశాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భర్త, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మమత గ్రూప్ – 1 సాధించడమే తన లక్ష్యమని వెల్లడించింది.

రూ.కోట్లు కాజేసిన వారిపై చర్యలేవి?

- కొమ్మినేపల్లి జీపీలో నిధుల స్వాహాపై కొలిక్కిరాని విచారణ
- ఐదేళ్లు దాటుతున్నా చర్యలు శూన్యం


కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

కామేపల్లి: ప్రభుత్వ అధికారి లేదా ఉద్యోగి అయినా అవినీతికి పాల్పడ్డాడని తెలియగానే సస్పెండ్ చేయడం.. ఆపై విచారణ పేరిట కొన్నాళ్లు హడావుడి చేయడం, ఆ తర్వాత వదిలేయడం ఆనవాయితీగా మారిందనే విమర్శలు వస్తున్నారు. రూ.కోటి మేర కాజేసినట్లు తెలిసినా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా, చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామపంచాయతీలో 2018 ఆగస్టు నుంచి 2019 ఫిబ్రవరి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది. అప్పట్లో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రాయల కరుణాకర్ సుమారు రూ.కోటికి పైగా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు రావడంతో అప్పటి కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్ పంచాయతీ కార్యదర్శితో పాటు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. ఆతర్వాత ఆనాటి సబ్ కలెక్టర్ హన్మంత్ కొండిబా విచారణ చేపట్టి నివేదిక సమర్పించినా తదుపరి చర్యలు తీసుకోలేదు. అవినీతి బయటపడి ఐదేళ్లు కావొస్తుండగా, పగ్గాలు చేపట్టిన పంచాయతీ పాలకవర్గం గడువు ముగిసి మళ్లీ ప్రత్యేకాధికారి పాలన మొదలైంది. ఇప్పటివరకు సస్పెన్షన్ తప్ప నిధుల రికవరీపై అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి ఉద్యోగులు స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని కొమ్మినేపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీయాలి


మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొణిజర్ల: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తే వారు ఉన్నత స్థాయికి చేరతారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కొణిజర్ల మండలం సింగరాయపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యాన గురువారం క్విజ్ పోటీలు నిర్వహించగా పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించడం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ పోటీల్లో తుమ్మపల్లి, తనికెళ్ల, పెద్దమునగాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో వారికి డీఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనారాయణతో పాటు కె.రామారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 37మంది..

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 37 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, అవాజ్ లిమిటెడ్‌ల్లో నియామకాలకు జాబ్‌మేళా నిర్వహించగా 169 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 37మందిని ఎంపిక చేసినట్లు కంపెనీల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రం భోజనంలో బల్లి

కల్లూరురూరల్: మండలంలోని కిష్టయ్య బంజరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పిల్లలకు వడ్డించేందుకు తయారుచేసిన అన్నంలో బల్లి పడింది. కేంద్రానికి వచ్చిన పిల్లలు భూక్యా గౌతమ్, పసుపులేటి పావని ఆ అన్నం తింటుంటుండగా ఆయా భూక్యా అంక్లీ బల్లిని గుర్తించింది. దీంతో పిల్లలను కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి ఎలాంటి సమస్య ఎదురుకాలేదని తెలిపారు. అలాగే, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్ ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లా డి పిల్లల ఆరోగ్యానికి ప్రమాదం లేదని తెలుసుకున్నాక సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోడును అడ్డుకున్న అటవీ అధికారులు


పోడుదారులతో మాట్లాడుతున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి అటవీరేంజ్ పరిధిలోని చంద్రాయపాలెం బీట్‌లో గురువారం గిరిజనులు, గిరిజనేతరులు పోడు కొట్టేందుకు వెళ్లగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. అయితే, పోడుదారులను అడ్డుకునే క్రమంలో రేంజర్ స్నేహలత, సిబ్బందిపై దుర్భాషలాడగా కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అసైన్డ్ భూమిలో గత పదేళ్లుగా పోడు కొట్టేందుకు వస్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని నిరసన తెలిపారు. ఈక్రమంలో రెవెన్యూశాఖతో జాయింట్ సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని రేంజర్ చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఖాతాదారులకు ప్రయోజనకరంగా పథకాలు


ఎస్బీ డీడీ సత్యనారాయణను సత్కరిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పథకాలను అమలు చేస్తున్నామని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖమ్మం రీజియన్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి తెలిపారు. నగరంలోని బ్యాంకు బ్రాంచ్‌ల్లో శుక్రవారం ఖాతాదారుల సేవా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ఖాతాదారుల ఆకాంక్షలకు అనుగుణంగా రుణ, డిపాజిట్ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు. ఈసమావేశాల్లో పలువురు ఖాతాదారులు, ఉద్యోగులను సన్మానించారు.

హైదరాబాద్ సీసీఎస్‌కు సారంగపాణి

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా పనిచేసిన సారంగపాణిని హైదరాబాద్ సీసీఎస్‌కు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు రోజుల క్రితం ఆయనను హైదరాబాద్ ఎస్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో మార్పు చేయగా, ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా ఎవరినీ నియమించలేదు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

29న చిరు ధాన్యాలపై అవగాహన


మాట్లాడుతున్న రామారావు, పక్కన నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: చిరు ధాన్యాలపై పరిశోధన చేసిన పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ నేతృత్వాన ఈనెల 29న ఖమ్మంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు తెలిపారు. ఖమ్మంలో గురువారం ఆయన మాట్లాడుతూ స్వర్ణభారతి కల్యాణమండపంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఖాదర్ వలీని సన్మానిస్తామని తెలిపారు. ఆతర్వాత చిరు ధాన్యాల ఆవశ్యకత, వినియోగంతో లాభాలపై ఆయన ప్రసంగం ఉంటుందని చెప్పారు. అలాగే, సుప్రీంకోర్టు రిటైర్డ్ సీజే ఎన్.వీ.రమణ ఖమ్మంకు వచ్చేనెల 10న ఖమ్మం రానుండగా, కులమతాలకతీతంగా సన్మానించాలని నిర్ణయించామని వెల్లడించారు. కాగా, రేణుకాచౌదరికి రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడంపై రామారావు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గోడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్లకు చెందిన ఓ బాలుడిని ముగ్గురు సభ్యుల ముఠా కిడ్నాప్‌కు యత్నించగా, గ్రామస్తులు వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని సెంటర్‌కు గురువారం రాత్రి మధ్యప్రదేశ్‌కు చెందిన శివరాంసింగ్‌తో పాటు ఓ మహిళ, యువకుడు చేరుకుని ఎస్సీ కాలనీలోని ఇంట్లో ఉన్న బాలుడు నందును ఎత్తుకుని పరుగులు తీశారు. దీంతో బాలుడి తల్లి కేకలు వేస్తుండగా సమీపంలోని మొక్కజొన్న చేను వద్ద బాలుడి వదిలేసి పరారవుతుండగా స్థానికులు వెంబడించి శివరాంసింగ్‌ను పట్టుకుని చితకబాదారు. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులకు అప్పగించారు. కాగా, ప్రస్తుతం శివరాంసింగ్ అపస్మారక స్థితిలో ఉండడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కొన్నాళ్లుగా పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా తిరుగుతోందన్న ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు బాలుడిని కిడ్నాప్ చేసేందుకు యత్నించడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పుకార్లను నమ్మొద్దు..

ఖమ్మం క్రైం: చిన్నపిల్లలను కిడ్నాప్ చేసే ముఠా తిరుగుతోందని జరుగుతున్న పుకార్లను నమ్మొద్దని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 ద్వారా కానీ, సమీప పోలీస్‌స్టేషన్‌లో కానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. అలాగే, తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేసే వారిపైనా చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

అనారోగ్య కారణాలతో ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని సీతారాంపురానికి చెందిన మరికటి చంద్రయ్య(50) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుమలాయపాలెం ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆతర్వాత ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని చేను వద్దకు వచ్చి పురుగులమందు తాగి పడిపోగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

కల్లూరురూరల్: మండలంలోని పోచవరంలో గురువారం పది ఎకరాల పొలంలో కోసిన గడ్డి అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు చింతలపూడి మాధవరావు గడ్డివామి ఏర్పాటుచేయగా, సమీపంలో కొందరు చెత్త కాలుస్తుండగా గాలికి నిప్పు రవ్వలు ఎగిరి పడ్డాయి. దీంతో మంటలు అంటుకుని రూ.70వేల విలువైన గడ్డి కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వాహనం వచ్చేలోగా గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఈమేరకు జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు చింతలపూడి బా రిష్టర్, చావా వీరభద్రం ఘటన వివరాలు తెలుసుకున్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్‌లో ఎంఎల్‌టీ కోర్సు 2019 మార్చి తర్వాత ఉత్తీర్ణులైన వారు ఏడాది పాటు క్లినికల్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. జిల్లాలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ చెల్లించాల్సి ఉంటుందని, గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బయోడేటా ఫారం, సర్టిఫికెట్ల జిరాక్స్‌తో పాటు రూ.10 పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా గల కవర్‌ను ఈనెల 26 సాయంత్రం ఐదు గంటల్లోగా తమ కార్యాలయంలో అందజేయాలని డీఐఈఓ సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

కల్లూరు: మండలంలోని కప్పలబంధం గ్రామ సమీపాన పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈమేరకు రూ.1,500 నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై షాకీర్ తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది శ్రీనివాసరావు, నాగ రవి, విజయకాంత్ పాల్గొన్నారు.

పునఃప్రతిష్ఠాపన పూజలు..


జలబిందెలతో వస్తున్న మహిళలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడు శివాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం గోపూజ చేయగా, విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. ఈమేరకు గుడిపాడు, అయ్యగారిపేటకు చెందిన వందలాది మంది మహిళలు జలబిందెలతో తరలివచ్చి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి నాగేశ్వరరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, మాధురి మధు, బొంతు మాధవరావు, నాగళ్ల ప్రసాద్, వల్లభనేని పవన్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆస్తి ఇప్పించాలని వివాహిత ఆందోళన


బస్వాపురంలో ఆందోళన చేస్తున్న జ్యోత్స్న- రవి

కొణిజర్ల: తండ్రి నుంచి వారసత్వంగా వచ్చే ఆస్తి ఇప్పించాలంటూ ఓ వివాహిత తన భర్తతో కలిసి నాయనమ్మ, మేనత్త ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. కొణిజర్ల మండలం బస్వాపురానికి చెందిన ముక్కపాటి జ్యోత్స్న అదే గ్రామానికి చెందిన మద్దినేని రవిని ప్రేమవివాహం చేసుకుంది. జ్యోత్స్న తల్లిదండ్రులు ఆమె చిన్నతనంలోనే మృతి చెందగా నాయనమ్మ ముక్కపాటి శాంతమ్మ వద్ద పెరిగింది. కాగా, ఆమె ప్రేమ వివాహం కుటుంబీకులకు ఇష్టం లేకపోవడంతో ఇంటికి రానివ్వడం లేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా హైదరాబాద్‌లో ఉంటున్న జ్యోత్స్న – రవి తండ్రి వారసత్వంగా రావాల్సిన ఆస్తి విషయమై తరచూ అడుగుతుండగా, గురువారం గ్రామానికి వచ్చి నాయనమ్మ ఇంటి ఎదుట బైఠాయించగా ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది. ఈమేరకు ఆస్తి ఇప్పించాలని జ్యోత్స్న, అకారణంగా ఇంటి వద్ద గలాటా చేస్తున్నారని శాంతమ్మ వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదులతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె.శంకరరావు తెలిపారు.

పింఛన్లు, రుణాలు ఇప్పిస్తామని రూ.6లక్షలతో ఉడాయింపు

వైరారూరల్: ప్రార్థనలు నిర్వహిస్తూ స్థానికులను నమ్మించిన కొందరు, పింఛన్లు ఇప్పిస్తామని వసూలు చేసిన డబ్బుతో ఉడాయించిన ఘటన వైరా మండలం తాటిపూడిలో వెలుగుచూసింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ముగ్గురు రెండు నెలల క్రితం తాటిపూడి వచ్చారు. తొలుత ఒక రైతు ఇంటి వద్ద ప్రార్థనలు మొదలుపెట్టి స్థానికులను సమీకరించారు. తొలినాళ్లలో విందు ఏర్పాటుచేయడం, బహుమతులు ఇవ్వడం ద్వారా స్థానికులు వీరిని నమ్మారు. అనంతరం వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ ఇప్పిస్తామని రూ.500 నుంచి రూ.3 వేలు, ఇతర రుణాలు ఇప్పిస్తామంటూ రూ.5 నుండి రూ.30 వేల వరకు వసూలు చేశారు. సానికులు పలువురు వీరికి రూ.6 లక్షల మేర చెల్లించగా, ముగ్గురు వ్యక్తులు ఒక్కరొక్కరుగా గ్రామం నుండి వెళ్లిపోయారు. ఈవిషయాన్ని గురువారం గుర్తించిన బాధితులు తొలుత వారిని పరిచయం చేసిన ఖమ్మం వాసులను నిలదీయడంతో పాటు మాజీ సర్పంచ్ భట్టా పెద్దభద్రయ్య ఆధ్వర్యాన వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

ముదిగొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలు, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ గజ్జెల నరేష్ తెలిపారు. మండలంలోని సువర్ణాపురం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం తనిఖీలు చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి నాలుగు వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈమేరకు యజమానులు, డ్రైవర్లు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి


చంటి (ఫైల్)

కారేపల్లి: ఆర్థిక సమస్యలు తట్టుకోలేక పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని జైత్రతండాకు చెందిన బానోతు చంటి(22) రెండేళ్ల క్రితం ఎకరన్నర వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఈ భూమికి సంబంధించి నగదు చెల్లించాల్సిన గడువు సమీపించినా డబ్బు లేకపోవడంతో ఈనెల 13వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్..

కల్లూరు: విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చి మృతి చెందాడు. వేంసూరు మండలం రామన్నపాలెంకు చెందిన కాకాని శ్రీనివాసరావు(45) గురువారం ఉదయం సత్తుపల్లి డిపో నుంచి ఖమ్మంకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ (అద్దె)లో ప్రయాణికులతో వెళ్తున్నాడు. కల్లూరు సమీపాన ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో ప్రభుత్వాస్పత్రి వద్ద బస్సు ఆపి లోపలకు వెళ్లాడు. వైద్యులు చికిత్స ప్రారంభించకముందే నొప్పి తీవ్రమై మరణించాడు. కాగా, ఎంతకూ ఆయన బయటకు రాకపోవడంతో ఆరా తీసిన ప్రయాణికులు గుండెనొప్పితో మృతి చెందినట్లు తెలుసుకుని ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వగా, మరో బస్సులో వారిని పంపించారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

నేలకొండపల్లి: ఓ పెళ్లి వేడుక సందర్భంగా మద్యం మత్తులో ఉన్న యువకులు నృత్యం చేసే సమయాన ఘర్షణ జరగగా ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన కె.సీతారాములు తమ బంధువుల ఇంట్లో పెళ్లి సందర్భంగా మరికొందరితో కలిసి నృత్యం చేస్తున్నాడు. ఈక్రమంలోనే మద్యం మత్తులో ఉన్న ఇంకొందరు యువకులు చేరుకుని నృత్యం చేస్తూ సీతారాములుతో ఘర్షణ పడ్డారు. మాటమాట పెరిగి గొడవ తీవ్రం కావడంతో సీతారాములును చితకబాదగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టైరు పేలి చెరువులోకి దూసుకెళ్లిన కారు


చెరువులోకి దూసుకెళ్లిన కారు ఇదే...

సత్తుపల్లిరూరల్: కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న కారు సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి సమీపాన టైరు పేలడంతో రోడ్డు పక్కన చెరువులోకి దూసుకెళ్లింది. గురువారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో విధులు నిర్వర్తించేందుకు అవినాష్, మరో వ్యక్తి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే, చెరువులో నీరు తక్కువగా ఉండడంతో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం స్థానికులు సాయంతో చెరువు నుంచి కారును బయటకు తీశారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్ వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన గురువారం జరిగింది. ఖమ్మం నుండి సూర్యాపేటకు 50మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు కోదాడ క్రాస్ వద్ద కారును ఓవర్ చేసే క్రమంలో వెనుక వైపు ఢీకొట్టింది. దీంతో బస్సు కుదుపునకు గురికాగా ప్రయాణికులు హాహాకారాలు చేశారు. అయితే, ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో

మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు


ఘటనాస్థలంలో వరలక్ష్మి మృతదేహం

వైరారూరల్: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టగా ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందింది. ఇదేఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తల్లాడ మండలం రెడ్డిగూడెంకు చెందిన గంధపు వరలక్ష్మి(45) గురువారం తాటిపూడిలోని తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వైరాకు ఆటోలో బయలుదేరింది. తాటిపూడి గోదాం వద్ద రోడ్డు పక్కన ఆగిన లారీని ఆటో ఢీకొట్టగా వరలక్ష్మి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అలాగే, ఆటోలో ఉన్న ఉదయ్‌కిరణ్, మరో మహిళకు స్వల్పగాయాలు కావడంతో 108 సిబ్బంది చికిత్స చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు క్వింటాళ్ల మిర్చి చోరీ

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో రైతు పిన్నెల్లి శ్రీనివాస్‌కు చెందిన రెండు క్వింటాళ్ల మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారు. ఆయన తాను సాగు చేసిన మిర్చి పంటను గ్రామ సమీపంలోని కల్లంలో ఆరబెట్టాడు. అక్కడ మిర్చి చోరీకి గురైనట్లు గురువారం గుర్తించిన ఆయన చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.